



తనిఖీలు ముమ్మరం

పెంటపాడు: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు హైవే ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. డీఎస్పీ మూర్తి, రూరల్ సీఐ రమేష్ తనిఖీల్లో పాల్గొన్నారు.



ఉద్యాన వర్సిటీలో సదస్సు

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాలలో ఫీల్డింగ్ ఆవిష్కరణ, సృజనాత్మకత మేధో సంపత్తి హక్కులు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. వీసీ జానకీరామ్ మాట్లాడారు.



వైఎస్సార్‌సీపీలో చేరికలు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

11న కోర్టు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ నాయకులు

భీమవరం: పట్టణంలో ఈనెల 11న 14 కోర్టుల నూతన భవనం నిర్మాణానికి హైకోర్టు న్యాయమూర్తులు శంకుస్థాపన చేయనున్నారని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ రమణరావు, పాక రమేష్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ ఆకుల శేషసాయి, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ బీఎస్ భానుమతి, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. అనంతరం పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులోని ఆనంద ఫంక్షన్ హాల్లో జస్టిస్ ఆకుల శేషసాయి దంపతులకు సత్కారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొండూరి సూర్యనారాయణబాబు, ఏపీ రాజు, ఉండపల్లి రమేష్‌నాయుడు, యేలేటి న్యూటన్, సుంకర చంద్ పాల్గొన్నారు.

జంతు సంరక్షణ అందరి బాధ్యత



నీటి కుండలను పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): జంతువులను రక్షించడం, ప్రేమగా చూసుకోవడం అందరి బాధ్యత అని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని జేపీ రోడ్డులోని అష్టలక్ష్మి ఆలయంలో అంతర్జాతీయ జంతు ప్రేమికులు, అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్స్ 110 ఆధ్వర్యంలో వీధి జంతువులకు 30 నీటి కుండలను కలెక్టర్ చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవుల దాహార్తిని తీర్చేలా ప్రధాన కూడళ్లలో నీటి కుండలు ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దాత దేగల భవాని శీతల్, ఇంటర్నేషనల్ అలయన్స్ మాజీ ప్రెసిడెంట్ వీవీఎస్ శర్మ, వై.గోపీనాథ్, అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు పాశం సుభద్రదేవి, అల్లు వనజాక్షి, ఝాన్సీ, ఎం.అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ ఐపీఎస్‌లు



ట్రైనీ ఐపీఎస్‌లతో మాట్లాడుతున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం వచ్చిన 9 మంది ట్రైనీ ఐపీఎస్‌లు బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిశారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా చేపట్టిన చర్యలను కలెక్టర్ వారికి వివరించారు. అలాగే ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు, ఎన్నికల్లో ఓటర్లను ఎలా ప్రలోభాలకు గురిచేస్తారు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాల పనితీరు, ఎన్నికల ప్రచారానికి అనుమతులు మంజూరు, ఎన్నికల వ్యయాన్ని పర్యవేక్షించడం, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే వివిధ వార్తా పత్రికల్లో ప్రచురితమయ్యే ప్రచార ప్రకటనలు, పెయిడ్ ఆర్టికల్స్, సోషల్ మీడియా ప్రచారాలకు సంబంధించి నోటీసులు జనరేట్ చేయడం, సంబంధిత అభ్యర్థి ఖాతాలో ఖర్చును ఎలా జమ చేస్తారు తదితర విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ట్రైనీ ఐపీఎస్‌లకు కలెక్టర్ వివరించారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2024–25లో ప్రవేశాల కోసం విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను సమర్పించాలని, గురువారం నుంచి జూన్ 10వ తేదీ వరకు అవకాశం ఉందని ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి పి.రజిత ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తు కాపీని ప్రింట్ తీసుకుని తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఏదైనా ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జూన్ 10న సాయంత్రం 5 గంటలలోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు.

పర్సంటేజ్ పితాని

ఆరుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ.. మూడు సార్లు విజయం.. ముగ్గురు ముఖ్యమంత్రుల వద్ద రాష్ట్ర మంత్రిగా పనిచేసిన అనుభవం.. ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే.. ఇసుక దోపిడీ, అవినీతి, చీకటి కోణాలు, కులాల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతూ ఓటు బ్యాంకుగా మలుచుకుని రాజకీయాలు చేయడం ఆయన అసలైన నైజం. పర్సంటేజీ మంత్రిగా, ఇసుక రారాజుగా డెల్టా ప్రాంతంలో ఆయనకు ముద్దుపేర్లు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైనా.. మరోమారు ఓటు బ్యాంకు రాజకీయాలతో ఆచంట నియోజకవర్గంలో సరికొత్త డ్రామాకు తెరతీశారు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పితాని సత్యనారాయణ. పదేళ్లు మంత్రిగా పనిచేసినా నియోజకవర్గంలో ల్యాండ్ మార్కు అభివృద్ధి చేయకపోగా.. వేల లారీల ఇసుక దోపిడీ, ప్రతి పనికీ పర్సంటేజీల వసూలు చరిత్ర ఆయనది.

– సాక్షి ప్రతినిధి, ఏలూరు

ఇసుకాసురుడు

- ఇసుక దోపిడీలో కోట్లు గడించిన వైనం
- కోడేరు, సిద్ధాంతం రీచ్‌ల్లో తీవ్ర విధ్వంసం
- అడ్డుకున్న ఎస్సైపై బదిలీ వేటు
- అధికారులపై బెదిరింపుల పర్వం
- పర్సంటేజ్ నేతగా విస్తృత ప్రాచుర్యం
- ఆచంట టీడీపీ అభ్యర్థి చరిత్ర ఇది



తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉచిత ఇసుక పేరుకు మాత్రమే అన్నట్టు సాగింది. నదీ పరివాహక ప్రాంతాల్లోని టీడీపీ ఎమ్మెల్యేలు ర్యాంపులను స్వాధీనం చేసుకుని కోట్లు కొల్లగొట్టారనేది బహిరంగ సత్యం. ఆచంట నియోజకవర్గంలో పితానికి ఇదే కలిసి వచ్చింది. ఇసుక జోలికి సాధారణ ఎస్సై నుంచి సబ్ కలెక్టర్ వరకు ఎవరు వచ్చిన వారికి అంతే సంగతి. గతంలో ఇసుక లారీలను అడ్డుకున్నారని ఒక ఎస్సైపై బదిలీ వేటు, జిల్లాస్థాయి అధికారులు, సబ్ కలెక్టర్లపై తీవ్రస్థాయి అసహనాలు, ఆగ్రహాలు వ్యక్తం చేసిన సంఘటనలు కోకొల్లలు. రాష్ట్రంలోని అతి పెద్ద ఇసుక ర్యాంపుల్లో సిద్ధాంతం ఒకటి. ఇక్కడ నీటిలో ఉప్పు నీరు తగలకపోవడంతో ఇసుక నాణ్యంగా ఉండటంతో డిమాండ్ ఎక్కువగా ఉండేది. 2014–19లో ఆచంట నుంచి గెలుపొంది మంత్రిగా ఉన్న పితాని నియోజకవర్గంలోనే ఈ రీచ్ ఉంది. డెల్టాలో మంత్రి కూడా కావడంతో తీర ప్రాంతంలోని ఇసుక రీచ్‌ల్లోని మాఫియా మొత్తం ఆయన కనుసన్నల్లోనే నడిచేది. సిద్ధాంతం ర్యాంపు జాతీయ రహదారిని ఆనుకుని ఉండటం, రవాణా ఖర్చులు తక్కువగా ఉండటంతో దోపిడీకి తెరలేచింది. అప్పట్లో రోజుకు సగటున వందకుపైగా లారీలు సిద్ధాంతం రీచ్ నుంచి బయటకు వెళ్లేవి. రీచ్ నుంచి ఒక్క లారీ బయటకు వెళ్లాలన్నా పితాని అనుమతి తప్పనిసరి అనే రీతిలో దందా సాగింది.

అనధికార ర్యాంపు కూడా..

సిద్ధాంతం రీచ్‌కు కొద్ది దూరంలో మైనింగ్ శాఖ అధికారికంగా గుర్తించని ప్రాంతాల్లో అనధికారిక ర్యాంపు కూడా ఏర్పాటు చేశారు. ఆ ర్యాంపు నుంచి ఇతర జిల్లాలకు, తెలంగాణకు పితాని అనుచరగణం ఇసుక సరఫరా చేసేవారు. ఇక్కడ నుంచి రోజుకు వందకుపైగా లారీలు వెళ్లేవని సమాచారం. ఒక్క ఇసుకలోనే రోజువారీ ఆదాయం లక్షల్లో, నెలవారీ ఆదాయం కోట్లల్లో సంపాదించారంటే అవినీతి తీవ్రత అర్థం చేసుకోవచ్చు.

అక్రమ తవ్వకాలతో ధ్వంసం

కోడేరు ర్యాంపును కూడా పూర్తిగా ధ్వంసం చేశారు. అక్రమ తవ్వకాలతో సుదీర్ఘ కాలం మూతపడిన కోడేరు ర్యాంపుపై పితాని కన్నుపడింది. మంత్రి కావడంతో వెంటనే ర్యాంపునకు అనుమతులు ఇప్పించి ధ్వంస రచనకు 2017లో శ్రీకారం చుట్టి చివరి రెండేళ్లు గట్టిగా ఇసుకను దోచేశారు. ఈ ర్యాంపు ప్రారంభమయ్యే నాటికి జిల్లాలో మిగిలిన రీచ్‌లు మూతపడగా ఇసుకకు భారీ డిమాండ్ రావడంతో రోజుకు 200కు పైగా లారీలు, 25కు పైగా జేసీబీలతో మట్టి తవ్వకాలు 365 రోజుల పాటు నిరాటంకంగా సాగాయి. మొత్తానికి ఉచిత ఇసుక ఆదాయం కోట్లల్లోనే మంత్రికి ఉండేదని నియోజకవర్గమంతా బలమైన టాక్. కోడేరు ర్యాంపులో యూనిట్‌కు రూ.800 రేటు పెట్టి మరీ విక్రయించి వాటాలను కూడా 'చినబాబు'కు పంపారని నియోజకవర్గంలోని టీడీపీ నేతలే చర్చించుకునే స్థితి.

మట్టి మాఫియాకూ దాన్

మట్టి మాఫియాలోనూ భారీగానే వెనకేశారు. పెనుగొండలో 40 ఎకరాల ఇళ్ల స్థలాల లెవిలింగ్ కోసం సిద్ధాంతం, నడిపూడి తీరాల్లో వందల లారీల మట్టిని కొల్లగొట్టి కొద్ది భాగం లెవిలింగ్ పనులకు, మిగిలింది అంతా రియల్టర్లకు పెద్ద ఎత్తున విక్రయించిన వ్యవహారంలో బాగానే గిట్టుబాటైనట్లు సమాచారం.

అడ్డుకున్న ఎస్సైపై బదిలీ వేటు

కరుగోరుమిల్లి ఇసుక ర్యాంపును గట్టిగానే వాడారు. 2017 జూన్‌లో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న ఎస్సై పి.రవీంద్రబాబును బదిలీ చేయించారు. గుమ్మలూరులో పదుల సంఖ్యలో లారీలు ఎలాంటి పర్మిట్లు లేకుండా ఇసుక రవాణా చేస్తుంటే ఎస్సై సీజ్ చేశారు. లారీలను గంటల వ్యవధిలోనే ఎలాంటి ఉత్తర్వులు లేకుండా పంపించడంతో పాటు ఎస్సైను వీఆర్‌కు పంపడం అప్పట్లో రాష్ట్రంలోనే చర్చనీయాంశమైంది. ఈ ఘటనలోనే మంత్రి అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సైపై వీరంగం వేసి బెదిరించి 24 గంటల్లో వీఆర్‌కు పంపారు. ఎస్సైపై బదిలీ వేటు జిల్లా అధికారుల్లో తీవ్ర సంచలనం సృష్టించిన క్రమంలో అప్పటి సబ్ కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, సీఐ సుబ్బారావు ఎవరికీ తెలియకుండా ర్యాంపుపై మెరుపు దాడి చేశారు. 6 పొక్లయిన్లు, 28 జేసీబీలను సీజ్ చేశారు. అది కూడా ఎస్సైను బదిలీ చేసిన 24 గంటల్లోనే కావడం ప్రత్యేకంగా చెబుతుంటారు.

10 శాతం ఫిక్స్

ఆర్అండ్‌బీ ఇన్‌చార్జిగా పనిచేసిన కాలంలో నియోజకవర్గంలో చేసిన పనులకు సంబంధించి నాణ్యతా ప్రమాణాలకు పూర్తి మినహాయింపు ఇచ్చి పర్సంటేజీలు వసూలు చేసినట్టు టాక్. ఇందుకు ఉదాహరణగా మార్టేరు–పెనుగొండ ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణం ఒకటి. 2015 గోదావరి పుష్కరాల సమయంలో హడావుడిగా చేసిన పనుల్లో భారీగానే మిగిలినట్లు సమాచారం. టీడీపీ ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి తూతూమంత్రంగా తీర ప్రాంతంలో పనులు చేపట్టింది. నియోజకవర్గంలో సిద్ధాంతం నుంచి భీమలాపురం వరకు రూ.10 కోట్లతో స్నానఘట్టాల నిర్మాణం, మరో రూ.20 కోట్ల మేర రహదారులు, తాత్కాలిక వసతులు పనులు 15 రోజుల్లో చేసి ఎక్కువ శాతం మిగుల్చుకున్నారని టాక్. నియోజకవర్గంలో స్వచ్ఛభారత్‌లో భాగంగా 10 వేల మరుగుదొడ్ల నిర్మాణంలో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. అనుచరులతో నోడల్ ఏజెన్సీలు ఏర్పాటు చేసి నాణ్యతను వదిలేసి దండుకోవడంపై టీడీపీ ప్రభుత్వంలోనే విజిలెన్స్ విచారణ జరగ్గా బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేశారంటే అవినీతి తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అలాగే రూ.30 కోట్లతో ఏటిగట్ల పటిష్టతకు చేసిన మరమ్మతుల పనుల్లోనూ భాగానే మిగిలినట్టు తెలిసింది. పర్యవసానంగా వరదలు వచ్చినప్పుడల్లా గట్లు తెగడం సర్వసాధారణంగా అప్పట్లో మారింది.

10న గూడెంలో సీఎం జగన్ సభ



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 10న శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిగూడెంలో మేమంతా సిద్ధం ఎన్నికల సభ నిర్వహించనున్నారని డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ బుధవారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలోని పోలీసు ఐల్యాండ్ సమీపంలో బ్రహ్మానందరెడ్డి మార్కెట్ సెంటర్‌లో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యకర్తల అభీష్టాన్ని అధినేత దృష్టికి తీసుకెళ్లి ఇక్కడ సభ నిర్వహించాలని కోరగా ముఖ్యమంత్రి జగన్ అంగీకరించారన్నారు. సీఎం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పర్యటనకు సంబంధించి సభాస్థలి, పార్కింగ్ తదితర ప్రాంతాలను మంత్రి కొట్టు సందర్శించారు. ఆయన వెంట అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం ఉన్నారు.

పేదలకిచ్చే పథకాలపై చంద్రబాబుకు పగ

మంత్రి కారుమూరి ధ్వజం



తణుకు అర్బన్: పేదలకు అందే పథకాలపై చంద్రబాబు పగపట్టారని, ఎన్నికల అధికారిని అడ్డుపెట్టుకుని ప్రజలకు పథకాల లబ్ధి అందకుండా చేస్తున్నారని రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకులోని క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు సుఖంగా ఉంటే చూడలేని పరిస్థితుల్లో చంద్రబాబు ఉన్నారని అన్నారు. ఎన్నికల కోడ్ రాగానే అవ్వాతాతల పింఛన్ ఇంటి గుమ్మంలోకి రాకుండా అడ్డుకున్నారని, తాజాగా విద్యాదీవెన, ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ చేయూత వంటి పథకాల లబ్ధిని ప్రజలకు అందకుండా చేస్తున్నారని మండిపడ్డారు. పక్కనే ఉన్న తెలంగాణలో అమల్లో ఉన్న పథకాలన్నీ ప్రజలకు కోడ్ సమయంలో కూడా అందుతున్నాయని, అయితే ఏపీలో మాత్రం చంద్రబాబు అనే దుష్టగ్రహం కారణంగా పేదలకు అందాల్సిన లబ్ధి అందలేదని దుయ్యబట్టారు. ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్న విద్యాదీవెనను కూడా తల్లి బ్యాంకు ఖాతాకు లబ్ధి చేరనివ్వకుండా చేశారని ధ్వజమెత్తారు. రైతులకు అందాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు కూడా రెడీగా ఉన్నాయని అన్నారు. ఎన్నికల అధికారి తీరు కూడా అనుమానాస్పదంగా ఉందని, చంద్రబాబుకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం వెనుక ఆంతర్యం ఏంటో తెలియడం లేదని స్పష్టం చేశారు.

పవన్ కల్యాణ్ తీరుతో బేజారు

పవన్ కల్యాణ్‌పై ఉన్న ప్రేమాభిమానంతో జనసేన శ్రేణులు వారి తల్లితండ్రుల కష్టాన్ని సైతం వెచ్చిస్తుంటే.. పవన్ కల్యాణ్ మాత్రం చంద్రబాబు భజన చేస్తూ 21 సీట్లకే పరిమితమయ్యారని మంత్రి కారుమూరి అన్నారు. అందులో కూడా 10కి పైగా టీడీపీ నుంచి జనసేనలోకి జాయిన్ అయినట్లుగా చూపించి సీట్లు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. పవన్ కల్యాణ్ ఓటమికి చంద్రబాబే ప్రయత్నాలు చేస్తున్నారని, పవన్ కల్యాణ్‌ను గెలవనివ్వనని అన్న మహాసేన రాజేష్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఇల్లింద్రపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, యడ్లపల్లి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తలపై కేసుల నమోదు

తాడేపల్లిగూడెం: జనసేన కార్యకర్తలపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. స్థానిక కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్ వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓటర్లను మభ్యపెట్టేలా నగదు పంపిణీ చేయడం, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడంపై పట్టణ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈనెల 6, 7 తేదీల్లో జనసేన శ్రేణుల ప్రలోభాలపై ఆర్‌ఓ చెన్నయ్యకు ఆరు వీడియోలు, 15 ఫొటోలు అందాయి. వీటిని పరిశీలించి, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి 2024 ఎన్నికల నిబంధనావళి ఉల్లంఘనలకు గాను చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్‌ఓ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు క్రైమ్ నంబర్ 156 కింద సెక్షన్లు 188 , 171 రెడ్ విత్ 34 ఐపీసీ నిబంధనల మేరకు కేసులు కట్టారు. తోట రాజా, మేరుగు రాజగోపాల్, అంగిన దేవేంద్ర, కూడవల్లి రాజు అనే జనసేన కార్యకర్తలపై పట్టణ ఎస్సై జేవీఎస్ ప్రసాద్ కేసులు నమోదు చేశారు.

13,177 పోస్టల్ బ్యాలెట్ల పోల్

కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా విధులు నిర్వహించే ఉద్యోగులు బుధవారం వరకు జిల్లాలో 13,177 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. భీమవరం కలెక్టరేట్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 6, 7వ తేదీల్లో నియోజకవర్గాల వారీగా ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్లల్లో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోగా, బుధవారం నుంచి ఈనెల 11 వరకు సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటును వినియోగించుకోవచ్చన్నారు. ఈనెల 6,7 తేదీల్లో 12,773 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోగా, బుధవారం 404 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారు ఎన్నికల డ్యూటీ ఆర్డర్ , ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు, ఎంప్లాయ్ ఐడీలను పరిశీలించి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలని పోలింగ్ సిబ్బందిని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే సెంటర్‌లో ఓటర్లకు తాగునీరు, షామియానా, కుర్చీలు, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది అంతా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

నరసాపురం అభివృద్ధే లక్ష్యం



సాక్షితో చీఫ్ విప్, ఎమ్మెల్యే, నరసాపురం ఎమ్మెల్యే అభ్యర్థి ముదునూరి

ఇంటర్వ్యూ

నరసాపురం ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నరసాపురం ఎమ్మెల్యే అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు. సీఎం జగన్‌ను నియోజకవర్గానికి తీసుకువచ్చి రూ.3,200 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఏకకాలంలో శంకుస్థాపనలు చేయించడంతో పాటు దాదాపు అన్ని ప్రాజెక్టులనూ పట్టాలెక్కించారు. పనులన్నీ ప్రాథమిక దశలో ఉన్న ఈ తరుణంలో నరసాపురం ప్రగతి కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలని ఆయన అన్నారు. 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన అభిప్రాయాలను ఇలా పంచుకున్నారు.

– నరసాపురం

సాక్షి: మీ 20 ఏళ్ల రాజకీయ జీవితం ఎలా ఉంది?

ముదునూరి: చాలా సంతోషంగా ఉంది. అప్పుడే 20 ఏళ్లు నిండిపోయాయా అనిపిస్తోంది. అలాగే రాజకీయాల్లో ఎదురీత గుర్తొస్తుంది. ఈ స్థాయిలో ఉన్నానంటే వైఎస్ కుటుంబమే కారణం. పార్టీ ఏది చెబితే అదే చేశాను. అందుకనే ఏమో ఇటీవల భీమవరంలో జరిగిన సిద్ధం సభలో సీఎం జగన్ నన్ను ప్రజలకు పరిచయం చేస్తూ.. ప్రసాద్ క్యారెక్టర్ ఉన్నోడు అని అన్నప్పుడు ఆనందంతో కన్నీళ్లు వచ్చాయి.

సాక్షి: మీ రాజకీయ ప్రయాణంపై క్లుప్తంగా..

ముదునూరి: యలమంచిలి మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఉండగా 2004లో నరసాపురం నుంచి అసెంబ్లీకి పోటీ చేసే అవకాశం వచ్చింది. తొలి ప్రయత్నంలో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందాను. మళ్లీ 2009లో వైఎస్సార్ ప్రోత్సాహంతో బరిలో దిగి విజయం సాధించాను. తర్వాత ఆయన మరణం. జగన్‌కు మద్దతుగా నేను ఎమ్మెల్యే పదవి వదులుకోవడం, మళ్లీ 2012 ఉప ఎన్నికలకు వెళ్లడం వంటివి జరిగాయి. అప్పటి నుంచి జగన్ వెంటే నడిచాను. 2019 ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించాను. చీఫ్ విప్ పదవి ఇచ్చారు.

సాక్షి: ఈ ఐదేళ్ల పాలన ఎలా ఉంది?

ముదునూరి: పేదల పక్షపాతి సీఎం జగన్ నేతృత్వంలో పనిచేస్తూ, ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కడం గొప్పగా భావిస్తున్నాను. ఎక్కడా లేనివిధంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేశారు. పాలనను ప్రజల ఇంటికే చేరువ చేశారు.

సాక్షి: రూ.3,200 కోట్ల ప్రాజెక్టులకు ముఖ్యమంత్రితో శంకుస్థాపన ఎలా సాధ్యమైంది?

ముదునూరి: ఇది నిజంగా చరిత్రే. పక్కా జీఓలతో, ఆర్థిక శాఖ అనుమతులతో మంజూరు చేసిన ప్రాజెక్టుల్లో ఆక్వా యూనివర్సిటీ పనులు ప్రారంభమయ్యాయి. తాత్కాలిక భవనంలో తరగతులు ప్రారంభించాం. బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ పనులను విశ్వసముద్ర సంస్థ టెండర్ దక్కించుకుని పనులు మొదలు పెట్టింది. ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టించకపోతే వశిష్ట వంతెన పనులు ఈ పాటికే మొదలయ్యేవి. వంతెన పనుల టెండర్లు తెరవాల్సి ఉంది. అలాగే రూ.1,400 కోట్లతో చేపట్టిన వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు పనులు మెగా సంస్థ చేపట్టింది.

సాక్షి: ఈ ఐదేళ్లలో మీకు సంతృప్తినిచ్చిన అంశాలు?

ముదునూరి: కరోనా సమయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. అలాగే సంక్షేమ పథకాలు అందించాం. సీఎం జగన్‌తో భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయించాం. నియోజకవర్గంలో 15 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చాం. రూ.1,421 కోట్ల సంక్షేమ పథకాల సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేశాం.

సాక్షి: ప్రతిపక్షాల విమర్శలపై మీ కామెంట్?

ముదునూరి: ప్రతిపక్షాలు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏం చేయలేకపోయినా ఇప్పుడు విమర్శలు మాత్రం చేస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లలో నియోజకవర్గంలో ఒక్క ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడా లేదు. మేం ఈ ఐదేళ్లలో నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను తీసుకొచ్చాం. ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కూడా తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. దేశంలో మూడోదిగా ఫిషరీస్ యూనివర్సిటీ వచ్చింది. నరసాపురాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా రూపుదిద్దుతున్నాం. వాళ్లు ఏమైనా చేశారా? ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన అన్ని ప్రాజెక్టులూ ప్రారంభమయ్యాయి. వాళ్లు కోర్టుల కెళ్లి అడ్డుకున్న వశిష్ట వంతెన పనులు తప్ప. రాబోయే వైఎస్ జగన్ ప్రభుత్వంలో వశిష్ట వంతెన కట్టి తీరుతాం.

సాక్షి: ఈ ఐదేళ్లలో ఏఏ పనులు పూర్తిచేశారు?

ముదునూరి: రూ.13 కోట్లతో రుస్తుంబాదలో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి చేశాం. రూ.4.80 కోట్లతో బస్టాండ్, డిపో, హిందూ శ్మశాన వాటికను మహాప్రస్థానంగా అభివృద్ధి చేశాం. పేరుపాలెం బీచ్‌లో బీచ్ ఫెస్టివల్ నిర్వహించాం. బీచ్ అభివృద్ధి చేశాం.

సాక్షి: మళ్లీ వైఎస్సార్‌సీపీకి ఎందుకు ఓటు వేయాలి ?

ముదునూరి: నేనైతే పేదవాడి కోసం అని చెబుతాను. నిజంగా సీఎం జగన్ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం ఎక్కడా లేనివిధంగా పథకాలు అమలుచేస్తున్నారు. ఇంటి తలుపుతట్టి పథకాలు అందిస్తున్నారు. పేదల మోముల్లో చిరునవ్వులు చెదిరిపోకుండా ఉండాలంటే మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలి.

సాక్షి: మీ గెలుపు అవకాశాలు ఎలా ఉన్నాయి?

ముదునూరి: నియోజకవర్గంలో నా విజయానికి ఢోకా లేదు. నేను ప్రజలను పూర్తిగా నమ్ముకున్నాను. మొదటి నుంచి నిత్యం ప్రజల్లోనే ఉన్నాను. ఇప్పుడు ముగ్గురు కలిసి నన్ను ఓడించాలని వస్తున్నారు. ఆ ముగ్గురూ ఒకప్పుడు ప్రత్యర్థులు కూడా. నేను చేసిన అభివృద్ధి, ముఖ్యమంత్రి అందించిన సంక్షేమంతో ప్రజల్లో నాపై పూర్తి నమ్మకం ఉంది. వారి నమ్మకం ముందు ఎందరు కలిసినా ఉపయోగం లేదు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



లక్ష్మీపాలెంలో గుణ్ణం నాగబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన, టీడీపీ నాయకులు

యలమంచిలి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే ఈ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు దోహదం చేస్తాయని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు అన్నారు. లక్ష్మీపాలెంలో బుధవారం టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు నాగబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ నాగబాబు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నచ్చడం వలనే టీడీపీ, జనసేన నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారంతా పాలకొల్లు ఎమ్మెల్యేగా గుడాల శ్రీహరి గోపాలరావు, నరసాపురం ఎంపీగా గూడూరి ఉమాబాల విజయానికి కృషి చేయాలని కోరారు. సర్పంచ్ గటింటి మహేష్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లాడి ఏడుకొండలు పార్టీ నాయకులు పెసంగి సుబ్రహ్మణ్యం, మోకా ప్రేమ్‌చంద్, లంకే సూర్య చంద్ర, పెసంగి ఏసు, పొన్నమండ నరసింహ స్వామి, ఉండవల్లి చక్రవర్తి, జల్లి నరసింహమూర్తి, కందికట్ల చిట్టిబాబు, పొన్నమండ వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో మోకా రవితేజ, పొన్నమండ ముత్యాలు, కర్రి ఆంజనేయులు, మల్లాడి గంగరాజు, కర్రి పెద్దిరాజు, కర్రి శ్రీనివాస్, కర్రి ప్రేమ్‌కుమార్, పెసంగి దుర్గాప్రసాద్, కర్రి కృష్ణ, కర్రి సాయిబాబు, అంగాడి దుర్గా ప్రసాద్, మల్లాడి రవితేజ, వనమాడి సుబ్రహ్మణ్యం, పొన్నమండ వీరాస్వామి, బస్వాని విజయ్, బెజవాడ రామారావు తదితరులు ఉన్నారు.

గుడాల గోపి సమక్షంలో 70 మంది చేరిక

పాలకొల్లు అర్బన్: పేదల పక్షాన పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం పట్టణంలోని 18వ వార్డు రాజీవ్‌నగర్‌కి చెందిన 70 మంది యువజనులు గుడాల గోపి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గుడాల గోపి వీరికి పార్టీ కండువాలు మెడలో వేసి స్వాగతం పలికారు. మే 13న ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతీ కార్యకర్త బూత్‌లను పర్యవేక్షించి ప్రతీ ఒక్కరి చేత ఓటు వేయించాలని కోరారు. పాలకొల్లులో ఈ సారి వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించడానికి యువత నడుంకట్టాలన్నారు. పాలకొల్లును అభివృద్ధిపథంలో నడిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, వార్డు ఇన్‌చార్జ్ రామాంజుల పెదమధు, పసుపులేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ ఈసెట్

తాడేపల్లిగూడెం: పాలిటెక్నిక్ తర్వాత నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశానికి బుధవారం నిర్వహించిన ఏపీ ఈసెట్ పరీక్ష వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం పరీక్షకు 251 మందికి గాను 240 మంది, సాయంత్రం పరీక్షకు 249 మందికి 245 మంది హాజరయ్యారు. పరీక్షను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్ పర్యవేక్షించారు. కో–ఆర్డినేటర్ కొల్లా సురేష్, టీసీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కవిటంలో శ్రీరంగనాథరాజుకు మద్దతు తెలిపిన 200 తూర్పుకాపు కుటుంబాలు



శ్రీరంగనాథరాజుకు మద్దతు తెలుపుతున్న కవిటం తూర్పుకాపు కుటుంబాలు

పోడూరు: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలకు సముచిత స్థానం ఉంటుందని ఆచంట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో కవిటం గ్రామానికి చెందిన తూర్పుకాపు సామాజిక వర్గానికి చెందిన 200 కుటుంబాలు ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజును కలిసి మద్దతు తెలిపాయి. ఎన్నికల్లో శ్రీరంగనాథరాజును మరోసారి ఆచంట ఎమ్మెల్యేగా భారీమెజార్టీతో గెలిపించేందుకు, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమన్నారు. జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, కవిటం గ్రామకమిటీ అధ్యక్షుడు అంబళ్ల భాస్కరరావు, గ్రామసర్పంచ్ చుట్టుగుల్ల పూర్ణిమ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ పడాల వెంకట సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

దుంపగడపలో ఉమాబాల సమక్షంలో..



దుంపగడపలో మహిళలకు పార్టీ కండువా వేసి స్వాగతిస్తున్న ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల

ఆకివీడు: మహిళా పక్షపాతిగా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు మహిళలు ముగ్ధులవుతున్నారని నర్సాపురం పార్లమెంట్ అభ్యర్థిని గూడూరి ఉమాబాల, ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్.నర్సింహరాజు అన్నారు. మండలంలోని దుంపగడప గ్రామంలో 20 మంది మహిళలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరగా వారికి ఉమాబాల పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని మహిళలు తెలిపారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరుతో దుష్ప్రచారం



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): టీడీపీ అధినేత చంద్రబాబు తన హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై చెప్పుకునే దమ్ములేక ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరుతో చంద్రబాబు ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని, ఇది సరికాదని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పట్టణంలో బుధవారం మాలమహానాడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభ్యర్థి కొట్టు సత్యనారాయణకు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల గెలుపునకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు, లోకేషులు ప్రజలను తప్పు పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, పచ్చ మీడియా కూడా ఇందులో భాగమయ్యిందన్నారు. టైటిల్లింగ్ యాక్ట్ ద్వారా భూ తగాయిదాలు ఉండవని ప్రజలు గుర్తించాలన్నారు. మరోసారి జగన్మోహన్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వీరవల్లి సునీల్, గెద్దం అచ్చిబాబు, ప్రేమ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వాహా చేసిన రూ.36.15 లక్షల రికవరీ

దువ్వ వీవోఏ భాగ్యలక్ష్మిని విధుల నుంచి తొలగింపు

తణుకు/తణుకు టౌన్: తణుకు మండలం దువ్వ గ్రామంలోని ఐకేపీ గ్రామ సంఘంలో నిధులు పక్కదోవ పట్టించిన వీఏవో వీరమళ్ల భాగ్యలక్ష్మిని విధుల నుంచి తప్పించినట్లు ఏపీఎం ఎ.రామకృష్ణ బుధవారం చెప్పారు. గ్రామంలోని 28 డ్వాక్రా సంఘాలకు చెందిన సుమారు రూ.36.15 లక్షలను ఫోర్జరీ సంతకాలతో సొంత ఖాతాకు మళ్లించింది. దీనిపై గత నెలలో గ్రామంలో డ్వాక్రా సంఘ సభ్యులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయడంతో దీనిపై అధికారులు విచారణ చేపట్టారు. దువ్వ యూబీఐ బ్రాంచి పరిధిలో నిధులు దుర్వినియోగం అయినట్లు తేల్చారు. ఈ మేరకు గ్రామ సంఘం తీర్మానం ద్వారా భాగ్యలక్ష్మిని విధుల నుంచి తప్పించి దుర్వినియోగం అయిన నిధులను రికవరీ చేసినట్లు ఆయన వెల్లడించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

భీమవరం : భీమవరం టౌన్ – ఆరవల్లి రైల్వేస్టేషన్ల మధ్య మెంటేవారితోట సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్సై పీటీవీ రమణ బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెంది ఉండవచ్చన్నారు. మృతుడి వయస్సు 60 ఏళ్ల లోపు ఉండవచ్చని, తెలుపు, ముక్కుపొడి రంగు చారల టవల్, తెలుపు, ఆకుపచ్చ లుంగీ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 70939 39777 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

వాహన తనిఖీల్లో రూ.2 లక్షల నగదు స్వాధీనం



నగదును చూపుతున్న అధికారులు

కామవరపుకోట : కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా బుధవారం ఒక వ్యక్తి నుంచి రూ.2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్ట్ ఎన్నికల అధికారి మహమ్మద్ మోహిద్దీన్ తెలిపారు. వీరిశెట్టిగూడెంకు కారులో వెళుతున్న వ్యక్తి నుంచి ఈ నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ ఏఎస్సై స్వామి ద్వారా ఏలూరు ట్రెజరీలో జమ చేస్తామన్నారు. పోలీసు సిబ్బంది కె.రమేష్, కె.రామకృష్ణ, సూర్యారావు, షేక్ నాగూర్, ఎం.నాగార్జున, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కవి ప్రసాద్‌కు పురస్కారం


కవి ప్రసాద్‌ను ఘనంగా సత్కరిస్తున్న నిర్వాహకులు

తణుకు: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 5న తెలుగు–కన్నడ ద్విభాషా కవి సమ్మేళనంలో తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ పురస్కారం అందుకున్నారు. హైదరాబాదు కాచీగూడలో సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కవితా వైభవం అనే కవితకు ప్రసంశలు లభించాయి. అనంతరం ప్రముఖ రచయిత్రి జోస్యుల ప్రభాశాస్త్రి, చిట్టే లలిత, డేబా విజయ్‌కుమార్, ధనాసి ఉషారాణి, ప్రదీప్‌కుమార్ చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రసంశాపత్రాన్ని అందజేశారు.

రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం


ప్రత్తిపాడులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పార్టీ మండల శాఖ పూర్వాధ్యక్షుడు వీర్ల గోవింద్ పేర్కొన్నారు. బుధవారం ఎస్సీకాలనీ, కాగులంపాడు ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగనన్న చేపట్టిన పలు పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీర్ల వెంకటేష్, దేవాలయ చైర్మన్ సైపురెడ్డి రాంబాబు, వీర్ల సత్యనారాయణ, ఎస్సీ నాయకులు, ప్రత్తిపాడు యూత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో సెంట్ ఆన్స్ విద్యార్థి ప్రతిభ


సుహాసిని

తాడేపల్లిగూడెం: పాలిసెట్ ఫలితాల్లో పట్టణంలోని సెంట్ ఆన్స్ సంస్థ విద్యార్థిని కొవ్వూరి సుహాసిని 118 మార్కులు సాధించిం ది.స్టేట్ 32వ ర్యాంకు సాధించిందని సంస్థల చైర్మన్ అద్దంకి విజయకుమార్ తెలిపారు.

పేదల పక్షపాతి జగన్‌కు మద్దతివ్వండి

- మోసం, దగా, వంచనకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు
- ఎన్నికల ప్రచారంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ముదునూరు గ్రామంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే పసల, వడ్డి రఘురాం

పెంటపాడు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందజేశారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం పెంటపాడు మండలంలోని పెంటపాడు, ఆకుతీగపాడు, ముదునూరు, రావిపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందర్రావు, రాష్ట్ర అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాంతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల యూత్ నాయకులు మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి, గూడెం ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏన్నడూ లేని అభివృద్ధి జగనన్న హయాంలోనే జరిగిందన్నారు.రాబోయే రోజులలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందేందుకు జగనన్న అవసరం రాష్ట్రానికి తప్పక ఉందని ప్రజలు గుర్తించారన్నారు. నియోజవర్గంలో ప్రతి గ్రామంలో ప్రధానంగా మహిళలు ముక్తకంఠంగా జగనన్న మళ్లీ సీఎం అవ్వాలని కోరుకొంటున్నారన్నారు. కోట్లాది కుటుంబాలకు జగనన్న మేలు చేసారన్న సంగతి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి తీవ్ర విమర్శలు చేశారు. మోసం, దగ, వంచనకు చంద్రబాబు బ్రాండ్ అంబాసీడర్ అని విమర్శించారు. 14 ఏళ్ల పాటు సీఎంగా చేసిన చంద్రబాబు రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. పాకేజీలకు పవన్ అమ్ముడు పోయారన్నారు. ఈ విషయంపై జనసేన కార్యకర్తలు పవన్‌ను నిలదీయాలన్నారు. టీడీపీకి దాసోహం అంటూ వారిని కట్టుబానిసలుగా పవన్ చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందర్రావు, రాష్ట్ర అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాంలు మాట్లాడుతూ కులం, మతం, రాజకీయాలు చూడకుండా వైఎస్సార్ ప్రభుత్వంలో సీఎం జగనన్న ప్రతీ ఒక్కరికి లబ్ధి చేకూరేలా పథకాలు అందించారన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేశారని తెలిపారు. అంగన్‌వాడీ విద్యార్థులకు మంచి ఆహారం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, సర్పంచ్‌లు పెన్నాడ సూరిబాబు, తాడేపల్లి సూర్యకళ, భావన ధాన్యలక్ష్మి, దాసం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు తాతారావు, రెడ్డి సూరిబాబు, బుద్దన చంటి, కొణతాల వెంకట్రావు, దేవాబత్తుల వెంకన్నబాబు, ఎంపీపీ దాసరి హైమావతి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పలూరి వరలక్ష్మి, కొట్టు నాగేంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు అద్దంకి పెదవెంకటరత్నం, అద్దంకి బ్రదర్స్, పెంటపాడు ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, బస్సుల రెడ్డి, పార్టీ యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, రావిపాడు సొసైటీ అధ్యక్షులు కైగాల గణపతి, తాడేపల్లి ప్రేమ్‌కుమార్, నల్లమిల్లి అంజిరెడ్డి, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, ములగాల బాబ్జి, డెక్కపాటి వెంకటరమణ, భట్టు భరతాంజనేయులు , నిమ్మల పెదకాపు, దాసి బాబు, కునుకు పుల్లయ్య, వింజమూరి శ్రీనివాస్, పెన్నాడ రాఘవ, రావిపాడు సొసైటీ త్రిసభ్యకమిటీ సభ్యులు ఆయా గ్రామాల పార్టీ నాయకులతో పాటు పెంటపాడు జగన్‌యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలే పేదలకు అండ

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- అత్తిలిలో భారీ ఎన్నికల ప్రచార ర్యాలీ


అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాధా-రంగా మిత్ర మండలి అధ్యక్షుడు వంగవీటి నరేంద్ర

అత్తిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు కొండంత అండగా నిలిచాయని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం అత్తిలి, పాలి గ్రామాల్లో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాధా–రంగా మిత్ర మండలి అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు వంగవీటి నరేంద్రతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ మోటారు సైకిళ్లు, కార్లతో భారీ ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న పాలనలో కుల,మత,పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని, మరింత మేలు జరగాలంటే మీ చల్లని ఆశీస్సులు జగనన్నకు అందించాలని కోరారు. ప్రజలకు మంచి చేస్తున్న మీబిడ్డ జగన్‌మోహన్‌రెడ్డికి రోజురోజుకి పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు అసూయ, ద్వేషంతో జగన్‌మోహన్‌రెడ్డిపై దుర్భషలాడుతున్నాడని విమర్శించారు. రాధా–రంగా మిత్ర మండలి అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు వంగవీటి నరేంద్ర మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, మండలపార్టీ నాయకులు రంభ సూరిబాబు, గారపాటి నాగరాజు, కోరుకొల్లు వెంకట్రావు, సబ్బితి రాజేష్, గంటా నాగరాజు, కంకటాల సతీష్ తమ్మాబత్తుల రాము, రామిశెట్టి రాము, ఆకుల చిన బాబు, కాసగాని అబ్బులు,పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించండి

గ్రామాల్లో విస్తృతంగా నాయకుల ప్రచారాలు


రాపాకలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇరగవరం: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ పంపన అంజిబాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాపాక గ్రామంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. అలాగే మన ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావును, ఎంపీగా గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వెలగల సాయిబాబా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, కె ఇల్లిందలపర్రు, ఇరగవరం సొసైటి అధ్యక్షులు మల్లిరెడ్డి నాగార్జున, చవ్వాకులు శ్రీనివాస్, ఎఎంసీ ఉపాధ్యాక్షులు మమిడి శెట్టి శ్రీనివాస్, మండల బీసీ సెల్ అధ్యక్షులు కుడిపూడి నాగ సత్యనారాయణ, సర్పంచ్‌లు చేబ్రోలు స్వరాజ్యం, ఘంటా లక్ష్మీ, బృందావనం గోపాల కృష్ణ మూర్తి, ఘంటా అప్పారావు, రాపాక, ఓగిడి గ్రామాల్లోని పార్టీ అధ్యక్షులు, నాయకులు, ఎంపీటీసీలు, గ్రామా పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం


వెంకట్రావుపాలెం గ్రామంలో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ ఎలిపే గాంధీ

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వెంకట్రావుపాలెం సర్పంచ్ ఎలిపే గాంధీ అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రావుపాలెం గ్రామంలో ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ సీపీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కరోనా సమయంలోనూ ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిచేకూర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కొట్టు సత్యనారాయణను ఎన్నుకోవాలన్నారు. ఈ నెల 13వ తేదిన జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, కొట్టు సత్యనారాయణను గెలిపించాలన్నారు. అలాగే, కొండ్రుప్రోలు, పుల్లాయగూడెం, ఎల్.అగ్రహారం, కృష్ణాయపాలెం, ఆరుళ్ళ, వీరంపాలెం, వెంకట్రామన్నగూడెం తదితర గ్రామాల్లో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేశారు. నీలపాల రామన్న, పోలిమోను శ్రీనివాస్, పులమోలు వెంకటేశ్వరరావు, కొత్తపల్లి ప్రసాద్, కంఠమణి సత్యనారాయణ, నక్కా గంగాధర్, గజ్జరపు రామకృష్ణ, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

తాడేపల్లిగూడెం: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ బుధవారం కూడా కొనసాగింది. గూడెం నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ల ఓట్లు బుధవారం నాటికి 54 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఓటును వేయడానికి గడువు పెంచారు. తగిన ఆధారాలు చూపించి ఓటు వేయవచ్చు ఈ నెల 11 వతేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.



మనసున్న మారాజుకి ఆచంట.. ఇష్టమట



సాక్షితో వైఎస్సార్ సీపీ ఆచంట ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ఇంటర్వ్యూ

ఆయనకు ఆచంట అంటే ఎంతో ఇష్టమట. ఎక్కడి నుంచైనా పోటీ చేయమని జగనన్న అవకాశం ఇస్తే ఆచంటనే ఎంచుకున్నారట. ఇక్కడి నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కొరత వస్తే తన జేబులో డబ్బులు తీయడానికి సైతం వెనుకాడరు. ఎందరికో అన్నం పెట్టి ఆకలి తీర్చిన గుణం ఆయనది. అన్ని వర్గాలను ఆదరించడంలో సామాజిక న్యాయం పాటించే మనస్తత్వం ఆయన సొంతం. కరోనా, వరదల కష్టకాలంలో ప్రభుత్వ సాయానికి తోడు, తన సొంత ఖర్చులతో ప్రజలను ఆదుకున్న మనసున్న మారాజు. జగనన్న పాలనలో గృహనిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆచంట వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అంతరంగం ఆయన మాటల్లోనే...

- పెనుగొండ

ప్రశ్న: రాజకీయ రంగ ప్రవేశం ఎలా జరిగింది?

శ్రీరంగనాథరాజు: ఉన్నత కుటుంబం నుంచి వచ్చిన నేను వ్యాపార రంగంలో ఎదిగి స్థిరపడ్డా. పరోక్షంగా రాజకీయాల్లో సేవలందిస్తున్నా.. ప్రత్యక్ష రాజకీయాల్లో 2004లో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో అత్తిలి నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందాను. వైఎస్సార్ సహకారంతో అత్తిలిని అభివృద్ధి పథంలో ముందంజలో నిలబెట్టా. నియోజకవర్గాల పునర్విభజనలో అత్తిలి నియోజకవర్గం రద్దయింది. దీంతో 2009లో పోటీ చేయలేదు.

ప్రశ్న: 2019లో ఆచంట నుంచి పోటీ చేయడానికి ప్రధాన కారణం?

శ్రీరంగనాథరాజు: ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్సార్ సీపీలో చేరిన తరుణంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నచ్చిన నియోజకవర్గం నుంచి పోటీ చేయమన్నారు. ఆచంట అంటే నాకు ఇష్టం.. అందుకే ఈ నియోజకవర్గం ఎంచుకొన్నా. పాత అత్తిలి నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలు ఆచంటలో కలిశాయి. దీనికి తోడు ఈ నియోజకవర్గంలో నాయకులతో పరిచయాలు ఎక్కువగా ఉన్నాయి. 2019 ఎన్నికల్లో సీఎం జగన్ ప్రజాదరణ, స్థానిక నాయకుల పరిచయాలు, అత్తిలి ప్రజల ప్రచారంతో గెలుపొంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి క్యాబినెట్‌లో గృహనిర్మాణ శాఖ మంత్రిగా అవకాశం పొందాను.

ప్రశ్న: గృహనిర్మాణ శాఖా మంత్రిగా ఆచంట ప్రజలకు ఎలా తోడ్పాటు అందించారు.

శ్రీరంగనాథరాజు: గృహనిర్మాణ శాఖా మంత్రిగా నియోజకవర్గంలో 14 వేల మందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయడం జరిగింది. దీంతో పాటు ఇంటి నిర్మాణానికి సొంత నిధులతో అండగా నిలిచాను. పేదల ఇంటి నిర్మాణానికి 50 నుంచి 100 బస్తాలు సిమెంట్ సబ్సిడీపై ఇవ్వడం జరిగింది. అంతేగాకుండా, ఇంటి పునాదుల్లో బొండు మట్టి వేయడానికి ప్రత్యేక అనుమతులు తీసుకొని గోదావరి నుంచి కేవలం రవాణా చార్జీలు, లోడింగ్ చార్జీలకే బొండుమట్టి అందించి తద్వారా రూ.50 వేల నుంచి రూ.75 వేల ఖర్చు తగ్గేవిధంగా సహకారం అందించా.

ప్రశ్న: కోవిడ్ సమయంలో మీరు అందించిన సేవలు?

శ్రీరంగనాథరాజు: రాష్ట్రంలో తొలి కేసు ఆచంట నియోజకవర్గం పెనుగొండలోనే నమోదైంది. పెనుగొండ పరిసర ప్రాంతాల్లో నెలల తరబడి లాక్‌డౌన్ చేయాల్సి రావడంతో ఇక్కడి ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. దీంతో పెనుగొండతో పాటు, ఇతర ప్రాంతాల్లోనూ నిత్యావసర వస్తువులు అందించా. అంతేగాకుండా, జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భోజన సదుపాయాలు ఏర్పాటు చేశా. పెనుగొండలో మూడు నెలలకు పైగా ఉద్యోగులకు, నిరాశ్రయులకు భోజనాలు అందించడం జరిగింది. అంబులెన్స్‌లు కొరత లేకుండా చర్యలు తీసుకున్నా. ప్రతి జిల్లాలో ప్రతి మండలంలోనూ అంబులెన్స్ సేవలు అందించాం. గ్రామీణ ప్రాంతమైన పెనుగొండలో కోవిడ్ సెంటరు ఏర్పాటుకు కృషి చేసి ఇబ్బందులు తొలగించా.

ప్రశ్న: గోదావరి జిల్లాల్లో డొక్కా సీతమ్మను మించి పేదల కడుపు నింపడానికి ముందంజలో ఉంటారంటారు. దీనిపై మీ స్పందన?

శ్రీరంగనాథరాజు: చిన్ననాటి నుంచి అలవాటుగా వచ్చింది. యండగండిలో చదువకోవడానికి వచ్చిన వారు చాలామంది మాఇంట్లోనే భోజనం చేసేవారు. నేటికీ యండగండిలో వృద్ధులకు భోజనం క్యారేజీలు పంపిస్తా. గోదావరి పుష్కరాల్లో కొవ్వూరు, సిద్ధాంతం పుష్కర్ ఘాట్‌ల వద్ద రైస్ మిల్లర్స్ ఆధ్వర్యంలో లక్షలాది మందికి భోజనం సదుపాయం కల్పించాం. అత్తిలి, ఆచంట ఎమ్మెల్యేగా ఆయా ప్రాంతాల్లో కార్యాలయాల్లో నిత్యం భోజన సదుపాయం అందుబాటులో ఉంచాను. వైఎస్సార్ ఆసరాలో 60 వేలకు పైగా విందుభోజనం అందించడం జరిగింది. గోదావరి వరదల్లోనూ లంక గ్రామాల ప్రజలకు భోజన సదుపాయం సొంత ఖర్చులతో ఏర్పాటు చేశాను.

ప్రశ్న: ఓట్ల కోసం భోజనాలు పెడుతున్నారన్న ప్రతిపక్షాల విమర్శకు మీ సమాధానం?

శ్రీరంగనాథరాజు: మొదట ఇంటికి వచ్చిన వారి కడుపు చూడమని పెద్దలు చెప్పారు. ఆనాటి నుంచి అదే బాటలో వెళుతున్నా. మనకు సబంధంలేని గుంటూరు జిల్లాలోని గుంటూరు ప్రభుత్వాసుపత్రిలోనూ, అలంపురం ఆసుపత్రిలోనూ, ద్వారకాతిరుమల నడిచి వెళ్లే భక్తులకు భోజన వసతి కల్పిస్తున్నా. వీరంతా ఆచంట నియోజకవర్గవాసులు కాదు కదా? వారు వచ్చి ఓట్లు వేయరు కదా? కుసంస్కారంతో ప్రతిపక్ష పార్టీ నాయకులు ఓర్వలేకే ఇటువంటి విమర్శలు చేస్తారు. భోజనాలకు వెళుతున్న మహిళలను వారు కించపరుస్తూ వ్యాఖ్యలు చేశారు.. అది వారి సంస్కారం.

ప్రశ్న: అభివృద్ధిలో సొంత నిధుల ఖర్చుకూ వెనుకాడరంటారు?

శ్రీరంగనాథరాజు: ఇచ్చిన మాట కోసం నిధుల కోసం వేచి ఉండే మనస్తత్వం కాదు. అత్తిలి ఎమ్మెల్యేగా పెనుమంట్ర మండలంలోనూ నిధులు మంజూరు కాకుండానే ప్రధాన కాలువపై వంతెన నిర్మించా. ఆచంటలోనూ చాలా గ్రామాల్లో ఇదే పనిచేశా. పంటకాలువలపై దశాబ్దాలుగా కల్వర్టులు లేక ఇబ్బందులు పడుతుంటే గత పాలకులు గాలికొదిలేశారు. ఇచ్చిన మాట కోసం సత్వరం ముందుగా నిర్మాణాలు ప్రాంభించి పూర్తిచేశా. అదేవిధంగా పలు ప్రాంతాల్లో దేవాలయాలకు సొంత నిధులు సమకూర్చడం జరిగింది. అభివృద్ధి పనుల్లోనూ నిధుల కొరతలో సొంత డబ్బులు వెచ్చించా.

ప్రశ్న: రైతులకు చేసిన సేవలు?

శ్రీరంగనాథరాజు: రైతు లేనిదే అభివృద్ధి లేదు. రైతులకు ఎప్పుడూ అండగానే ఉంటా. రైతు సుఖంగా ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుంది. ధాన్యం అమ్మకాల్లో గోనే సంచుల కొరత వస్తే సొంత ఖర్చులతో గోనే సంచులు ఏర్పాటు చేశా. నీటి కొరత రాకుండా సొంత ఖర్చుతో కర్రనాచు తొలగించడం, కాకరపర్రు వద్ద పాత లాకులు తొలగించి రైతు సాగునీటి ఇబ్బందులు తొలగించా.

ప్రశ్న: ఆచంట నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటి?

శ్రీరంగనాథరాజు: ఆచంట నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి జరిగింది. పెనుగొండ, ఆచంటల్లో రూ.4 కోట్లతో 30 పడకల ఆసుపత్రి భవనాలు నిర్మించాం. పెనుగొండలో ఉన్నత పాఠశాల విస్తరణ, మార్టేరు కూడలి అభివృద్ధి, పేదలకు రూ.1700 కోట్లతో సంక్షేమం, రూ.700 కోట్లతో అభివృద్ధి చేయడం జరిగింది. ఎన్నో ఏళ్లగా అభివృద్ధికి నోచుకోని శివారు ప్రాంతాలను అభివృద్ధి చేశా. పెనుగొండలో కోడి పందేల దిబ్బ, నగరేశ్వర స్వామి కాలనీల్లో అంతర్గత మౌలిక సదుపాయాలు, రహదారులు కల్పించాం. ఆధ్యాత్మికంగానూ అభివృద్ధికి కృషి చేశా. పలు చర్చిల నిర్మాణాల్లో భాగస్వామ్యం కావడమే కాకుండా పెనుగొండలో వాసవీ నివాస్ సత్రం, పెద్దింట్లమ్మ ఆలయ నిర్మాణం, వడలిలో గ్రా మ దేవత మందాలమ్మ ఆలయ నిర్మాణానికి నిధులు, అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయడం జరిగింది. ప్రతి సచివాలయం పరిధిలోనూ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ల నిర్మాణాలు చేపట్టాం. ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయి మరికొన్ని నిర్మాణ దశల్లో ఉన్నాయి.

ప్రశ్న: ప్రతిపక్ష నేత విమర్శలకు మీ సమాధానం?

శ్రీరంగనాథరాజు: ప్రతిపక్ష నేత పితాని సత్యనారాయణ ఓటమి భయంతో విమర్శలు చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారు. కమీషన్లకు అలవాటు పడి నియోజకవర్గంలో నాణ్యత లేని పనులు చేయించిన ఘనుడు పితాని. ఇసుక ర్యాంపుల్లో ఇష్టారాజ్యంగా దోచుకొన్నాడు. ఈఎస్ఐ స్కాంలో పితాని తనయుడు ఇతర రాష్ట్రాలకు వెళ్లి దాక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో ఇతరులపై అవినీతి బురద చల్లడానికి ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎవరు అవినీతిపరులో తెలుసు.

ప్రశ్న: ఆచంటలో సామాజిక న్యాయం పాటించారంటారు. దీనిపై ఏం చెబుతారు?

శ్రీరంగనాథరాజు: గత పాలకులు కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేవారు. గొడవలు పెట్టి విభజించే వారు. నిత్యం పెనుగొండ, వడలి, సిద్ధాంతం వంటి ప్రాంతాల్లో గొడవలు సృష్టించేవారు. ఐదేళ్ల కాలంలో ఎక్కడా గొడవలు జరగకుండా కులాల మధ్య సమన్వయం కల్పించా. గతంలో శెట్టిబలిజలను ఓటర్లగానే వారి సామాజిక నాయకుడు వినియోగించుకొని గాలికొదిలేశారు. ఈ ఐదేళ్ల కాలంలో శెట్టిబలిజలను సొసైటీల్లో ఛైర్‌పర్సన్‌లను చేశాం. పలు నామినేటెడ్ పోస్టులు వారికి కల్పించాం. ఆచంట ఏఎంసీకి వరుసగా మూడు సార్లు ఎస్సీకి అవకాశం కల్పించడం జరిగింది.

ప్రశ్న: అయోధ్యలంక వారధిపై పితాని గాలిమాటలు చెప్పారంటారా?

శ్రీరంగనాథరాజు: ఆచంట నుంచి రెండు పర్యాయాలు పితాని గెలుపొందారు. గోదావరిపై బ్రిడ్జి నిర్మాణానికి గాలిమాటలు చెబుతూ కాలం గడిపారు. 2016లో ప్రజలను మభ్యపెట్టే విధంగా రూ.135 కోట్లు మంజూరు అంటూ శిలాఫలకం వేసి వదలివేశారు. దీనికి ఎటువంటి జీవో లేదు, రూ.75 కోట్లు అయ్యే బ్రిడ్జికి రూ.135 కోట్లు అంటూ ప్రచారం చేసుకొన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీనికి అనుగుణంగా 2020లో అంచనాలు వేయడం జరిగింది. ఉన్నత స్థాయి ఇంజనీరింగ్ అధికారులు పర్యటన చేసి రూ.75 కోట్లు అంచనా వేశారు. బ్యాంకు రుణం కోసం ప్రతిపాదనలు పంపాం. కరోనా వంటి ఇబ్బందులతో మధ్యలోనే నిలిచిపోయాయి.

ప్రశ్న: గెలుపు ధీమాపై మీ సమాధానం?

శ్రీరంగనాథరాజు: ఆచంట నియోజకవర్గంలో 20 వేలకు పైగా మెజార్టీతో నేను గెలుపొందడం ఖాయం. గతంలో 12,883 ఓట్లు మెజార్టీతో గెలిచా మూడు బూత్‌లు లెక్కించాల్సి ఉంది. వాటిలోనూ మెజార్టీ ఉంది. అంటే దాదాపుగా 15 వేల మెజార్టీతో గెలిచినట్లు. ఈ సారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు శ్రీరామరక్షగా నిలుస్తాయి. కరోనాతో కొంతమేర నిధుల కొరతతో కొన్ని పనులు నిలిచాయి. వాటిని పూర్తి చేసి ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తా.



పెంటపాడు: ప్రచారంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు హారతులు పడుతున్న మహిళలు

హారతులు అందుకుంటూ..

ప్రచార పర్వం

ఎన్నికల ప్రచార అంకానికి కొద్ది రోజులే మిగిలి ఉండడంతో అభ్యర్థుల ప్రచార హోరుతో గ్రామాలు మార్మోగుతున్నాయి. తమ గ్రామాలకు వచ్చిన వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ప్రజలు అడగడుగునా ఘన స్వాగతం పలుకుతూ.. విజేతలై తిరిగిరండి అని.. వీర తిలకం దిద్దుతున్నారు.

- సాక్షి, నెట్‌వర్క్



అత్తిలి: ప్రచారంలో భాగంగా మోటార్‌సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

వైద్య 'ఆనందిని'

- పేద విద్యార్థినికి డాక్టర్ విద్య
- కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్
- వరమైన జగనన్న విదేశీ విద్యాదీవెన

మెడలో స్టెతస్కోప్ వేసుకుని పేదల గుండె చప్పుడు వినాలని ఆ చిన్నారి ఉబలాటపడింది. ఒక్కో తరగతి పైకొస్తున్న కొద్దీ ఆ ఆశ బలమైన సంకల్పంగా మారింది. కూతురి తపన చూసి తల్లిదండ్రులు కలవరపడ్డారు. తమ స్తోమతకు వైద్య విద్య సాధ్యమేనా అని ఆందోళన చెందారు. పట్టువదలని ఆ విద్యార్థిని కష్టపడి చదివింది. కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్ సీటు పొందింది. అక్కడకు వెళ్లి చదవడం ఎలా అనుకుంటున్న తరుణంలో చీకటిలో వెలుగు దివ్వెలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం వరమైంది. ఆన్‌లైన్‌లో ఆఖరి రోజు దరఖాస్తు చేసిన ఆ విద్యార్థినికి సంక్షేమ సర్కారు అండగా నిలిచింది. వైద్యవిద్య కయ్యే పూర్తి ఫీజు భరించేందుకు ముందుకొచ్చింది. అక్కడికెళ్లేందుకు అయ్యే ఖర్చులనూ భరించింది. ఇప్పుడు కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న ఆ విద్యార్థిని మోములో ఆనందం తొణికిసలాడుతోంది.



వైద్య విద్యార్థిని జొన్నలగడ్డ నందిని, తల్లిదండ్రులు, తమ్ముడు

దశ తిరిగింది

ఏలూరు తంగెళ్లమూడి సెహర్‌మసీద్ ప్రాంతానికి చెందిన జొన్నలగడ్డ నర్సింహరాజు, రాజ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు సంతానం. నర్సింహరాజు వ్యవసాయం చేస్తారు. రాజ్యలక్ష్మి గృహిణి. వీరి పెద్ద కుమార్తె జొన్నలగడ్డ నందినికి కజకిస్థాన్‌లో అల్ ఫరాబీ ఖజక్ నేషన్ యూనివర్సిటీ (అంతర్జాతీయంగా 150వ ర్యాంకు)లో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. ఈ చదువుకు జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలిచింది. పూర్తి ఫీజు రూ.24 లక్షలు భరించేందుకు ముందుకొచ్చింది. మొదటి ఏడాది రూ.4 లక్షల 7 వేలు, రెండో సంవత్సరం ఫీజు కూడా ఇటీవల రూ.4 లక్షల 7 వేలు యూనివర్సిటీకి ప్రభుత్వం చెల్లించింది. నందిని కజకిస్థాన్ వెళ్లేందుకు వీసా, విమాన చార్జీలు సైతం ప్రభుత్వమే భరించింది. సుమారుగా రూ.50 వేల వరకు వీటి కోసం ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇదిలా ఉంటే నర్సింహరాజు కుమారుడు రాహుల్ ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. రాహుల్‌కు అమ్మ ఒడి పథకం ద్వారా లబ్ధి చేకూరుతోంది.

ఏలూరు నగరంలోనే పదుల సంఖ్యలో లబ్ధిదారులు

రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి అనేక అద్భుతమైన ఘటనలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎన్నో ఆవిష్కృతమయ్యాయి. ఏలూరు నగరంలో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంలో వైద్య విద్యను అభ్యసించేవారు ఇంకా పదుల సంఖ్యలో ఉండటం గమనార్హం. జగనన్న అందిస్తున్న పథకాలు తమలాంటి పేద విద్యార్థులు ఎందరికో ఉన్నత భవితను అందిస్తున్నాయని నందిని ఆనందంగా చెబుతోంది.

- ఏలూరు టౌన్

జగనన్నకు కృతజ్ఞతలు

మా కుమార్తె డాక్టర్ కావాలన్న కోరిక జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా నెరవేరుతోంది. మాలాంటి కుటుంబాలకు రూ.లక్షలు ఖర్చు చేసి ఉన్నత విద్య చదివించడం సాధ్యంకాని పరిస్థితి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు దేవుడిలా మారారు. భవిష్యత్తులోనూ ఆయన మరింతమంది పేద విద్యార్థుల భవితకు అండగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాం. ఆయనకు కృతజ్ఞతలు.

- జొన్నలగడ్డ రాజ్యలక్ష్మి, విద్యార్థిని తల్లి

సంక్షేమ 'ఆటో'గ్రాఫ్

- పథకాలతో ప్రగతి పథం
- చిరు కుటుంబానికి ఎంతో మేలు
- కుమార్తె వినికిడి సమస్యకు ఆరోగ్యశ్రీ చికిత్స

భార్యాభర్తలిద్దరూ రెక్కలుముక్కలు చేసుకుంటేగానీ నాలుగేళ్లు నోట్లోకి వెళ్లని నిరుపేద కుటుంబం. వచ్చిన దానిలో సగం అద్దెకే పోగా నెలంతా పిల్లలతో సహా అర్ధాకలితో అలమటించిన వైనం.. గత ప్రభుత్వం నిరాదరణతో సమస్యలతోనే నిత్యం సతమతమైన దైన్యం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక వారి కష్టాలన్నీ తీరిపోయాయి. గుండె లోతుల్లో దాగి ఉన్న దుఃఖం ఒక్కసారిగా భావోద్వేగమై.. బాష్పాల రూపంలో పొంగుకొచ్చింది. దేవుడే దిగివచ్చినట్టు హృదయం ఉప్పొంగింది. ఫలితంగా వరాల రేడు పాలన నిరంతరం కొనసాగాలని ఆ కుటుంబం ఆకాంక్షిస్తోంది. - దెందులూరు

ఏలూరు జిల్లా దెందులూరు మండలం సీతంపేట గ్రామానికి చెందిన బాలిన గిరిబాబు, ప్రసన్నలకు ఇద్దరు కుమార్తెలు. 15 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే నివాసం. గిరిబాబు ఆటో డ్రైవర్. వచ్చే దాదయం అంతంతమాత్రమే. ప్రసన్న కూడా చిన్నచిన్న పనులు చేస్తుంటుంది. అత్తెసరు ఆదాయంతోనే పిల్లలను చదివించుకునేవారు. ప్రస్తుతం పెద్ద కుమార్తె మహిత 6వ తరగతి, చిన్న కుమార్తె హేమశ్రీ 4వ తరగతి చదువుతున్నారు. హేమశ్రీకి వినికిడి సమస్య ఉండేది. వైద్యులకు చూపిస్తే రూ.6లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. అసలే అంతంతమాత్రం బతుకులు చికిత్స ఎలా చేయించాలో తెలీక గిరిబాబు, ప్రసన్న తల్లడిల్లారు. రేషన్ కార్డు కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా గత ప్రభుత్వం కరుణించలేదు.

దశ తిరిగింది



దెందులూరు మండలం సీతంపేట గ్రామానికి చెందిన బాలిన గిరిబాబు, ప్రసన్నల కుటుంబం

2019 తర్వాత..

2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గిరిబాబు కుటుంబ పరిస్థితి మారిపోయింది. భవిష్యత్తుపై కొత్త ఆశలు చిగురించాయి. నవరత్న పథకాలు ఆదరువుగా నిలిచాయి. ఇంటి స్థలం మంజూరైంది. ఇంటి నిర్మాణానికి రూ.లక్షా 80 వేలు ఉచితంగా ఇచ్చారు. గిరిబాబుకు వాహన మిత్ర పథకం ద్వారా ఏటా రూ.పదివేల చొప్పున రూ.40వేలు అందాయి. డ్వాక్రా సభ్యురాలిగా ఉన్న ప్రసన్నకు నాలుగు విడతలుగా వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణమాఫీగా రూ.60 వేలు వచ్చాయి. డ్వాక్రా గ్రూపులో లక్ష రూపాయల రుణం మంజూరైంది. 6వ తరగతి చదువుతున్న పెద్ద కుమార్తె మహితకు నాలుగేళ్లుగా అమ్మఒడి పథకం ద్వారా రూ.60 వేలు అందాయి. జగనన్న విద్యాకానుక అందింది. వినికిడి సమస్యతో ఉన్న రెండో కుమార్తె హేమశ్రీకి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత చికిత్స చేశారు. అంతేకాకుండా ప్రతినెలా హేమశ్రీకి రూ.3 వేల చొప్పున పింఛన్ అందుతోంది. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కొత్త ఆరోగ్యశ్రీ కార్డు మంజూరయ్యాయి. ఫలితంగా గిరిబాబు కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీమళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటోంది.